



ఎడమకాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద లీకేజ్ ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

గొట్టాను గాలికొదిలేశారు!

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- మరమ్మతులపై తీవ్రమైన నిర్లక్ష్యం
- శిథిలావస్థతో నిర్వహణకు ఇబ్బందులు
- ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు
- ఏళ్ల తరబడి కానరాని నియామకాలు
- ముగ్గురు సిబ్బందితోనే నెట్టుకొస్తున్న వైనం



గొట్టాబ్యారేజ దిగువన శిథిలావస్థకు చేరిన రాతి కట్ట నిర్మాణం

(హిరమండలం)

హిరమండలంలోని వంశధార నదిపై ఉన్న గొట్టాబ్యారేజీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఈ బ్యారేజీ జిల్లా రైతులకు సాగునీటితో పాటు ఎన్నో గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చేది. ప్రభుత్వం దీనికి అనుసంధానంగా సుమారు 1,750 కోట్లతో వంశధార రిజర్వాయర్ నిర్మిస్తోంది. కొన్నేళ్లుగా బ్యారేజీ మరమ్మతులు చేపట్టక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. గొట్టాబ్యారేజీకి 24 గేట్లతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ కాలువల హెడ్ రెగ్యులేటర్ గేట్లకు 2018 నుంచి కనీస నిర్వహణ లేదు. దీంతో గేట్లు, బేరింగ్‌లు, రోలర్లు పాడైపోయాయి. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీరు నిల్వ చేసేందుకు గేట్లు దించినా లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతోంది. ఏటా వరదల కారణంగా బ్యారేజీ దిగువ భాగాన జడ్జిస్టోన్ ఏప్రాన్ రాళ్ల తేలి పూర్తిగా దెబ్బ తింది. దీని స్థానంలో ఐదేళ్ల కిందట ఇంజనీరింగ్ నిపుణుల సూచన మేరకు కాంక్రీట్ (సీసీ) ఏప్రాన్ నిర్మాణానికి రూ.8.5కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పది శాతం పనులు చేసి నిలిపేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో 25 శాతం లోపు చేపట్టిన పనులు నిలిపేయాలని ఆదేశాలు వెలువ డ్డాయి. అప్పటి నుంచీ పట్టించుకునే నాథుడు లేక.. బ్యారేజీ పరిస్థితి దయనీ యంగా మారింది. బ్యారేజీ మరమ్మతుల కోసం వంశధార అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపినా నిధులు మంజూరు చేయని పరిస్థితి నెలకొంది. తక్షణమే సీసీ ఏప్రాన్ నిర్మించకపోతే నదికి వచ్చే వరదల సమయంలో బ్యారేజీ కి ముప్పు తప్పదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● అధ్వానంగా ఎడమ కాలువ..

వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఏటా నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గుతూ ఎక్కడో ఒకచోట గండ్లు పడుతున్నాయి. కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం కాగా 1,800 క్యూసెక్కులకు మించి నీటిని సరఫరా చేయలేక పోతున్నారు. 2వేల క్యూసెక్కులకు పైగా విడిచి పెడితేనే శివారు భూములకు సాగునీరందుతుంది. నీటి పరిణామం పెంచితే కాలువ గట్లు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతోంది. 1971-78 సంవత్సరాల మధ్య నిర్మించిన కాలువలు లైనింగ్ లేక చాలావరకు పూడుకుపోయాయి. కొన్నిచోట్ల అండర్ టన్నెల్‌లు, సుమారు 150 రాతి కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. షట్టర్లు, గేట్లు, రెగ్యులేటర్లు దెబ్బతిన్నాయి. ఈ ఖరీఫ్ ప్రారంభంలో కిట్టాలపాడు సమీపంలో అండర్ టన్నెల్ కూలి.. వారం రోజులకుపైగా సాగునీటి సరఫరా నిలిచిపోయింది. కాలువ ఆధునికీకరణకు వంశధార అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది కూడా రూ.850కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపినా అతీగతీ లేదు.



పెచ్చులూడిపోతున్న గొట్టాబ్యారేజీ రెయిలింగ్

వేధిస్తున్న సిబ్బంది కొరత..

గొట్టాబ్యారేజీ నిర్వహణకు ఉద్యోగులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. గతంలో 22 మంది ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, హెల్పర్, మేన్‌మజ్దూర్, ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, లస్కర్లు ఉండేవారు. దశాబ్దాల క్రితం నియమించిన ఉద్యోగులు కొన్నేళ్లుగా ఒక్కొక్కరూ పదవీ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో ప్రభుత్వం కొత్తవారిని నియమించడం లేదు. దీంతో ప్రస్తుతం ముగ్గురు ఉద్యోగులు మాత్రమే మిగిలారు. వరదల సమయంలో బ్యారేజీతో పాటు కుడి, ఎడమ ప్రధాన కాలువల నిర్వహణ వారికి కష్టమవుతోంది. తగినంత సిబ్బంది లేకపోవడంతో వరదల సమయంలో రాత్రీపగలు విధులు నిర్వహించాల్సి వస్తోంది.

● బ్యారేజీతోపాటు కుడి, ఎడమ ప్రధాన కాలువల నిర్వహణను పర్యవేక్షించాల్సిన డీఈ పోస్టు.. ఇన్‌చార్జి పాలనలో సాగుతోంది. రెగ్యులర్ డీఈ బదిలీపై వెళ్లిపోగా.. ఇన్‌చార్జి డీఈఈని నియమించారు. ఆయన ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

● గొట్టాబ్యారేజీ వద్ద వర్క్ ఇన్‌స్పెక్టర్లు షిఫ్టుల విధానంలో అందుబాటులో ఉంటూ కేంద్ర జలవనరుల సంఘం నుంచి వర్షపాతం, ఇతర వివరాలు రీడింగ్‌లు తెలుసుకుని రికార్డుల్లో నమోదు చేయాలి. వీరు నలుగురు ఉండాల్సి ఉండగా ముగ్గురు పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. అలాగే హెల్పర్లు కూడా ఎనిమిది మందికి ఇద్దరే ఉన్నారు.

● బ్యారేజీ వద్ద విద్యుత్ సరఫరా, జనరేటర్ నిర్వహణకు ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు.

● వరదల సమయంలో గేట్లు, ఎత్తి దించే ఆపరేటర్లు గతంలో నలుగురు ఉండేవారు. వారంతా పదవీ విరమణ చేశారు.

● బ్యారేజీ శుభ్రత, నిర్వహణలో సహాయకులుగా సేవలందించే 12 మంది మేన్ మజ్దూర్‌లు కూడా పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఈ పోస్టులన్నీ ఖాళీ.

● కాలువ నిర్వహణతోపాటు ఆయకట్టకు నీటిని మళ్లించేలా చూడాల్సిన లస్కర్ల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఎడమ కాలువ పరిధిలో 200 మంది, కుడి కాలువ పరిధిలో వంద మంది లస్కర్లు అవసరం కాగా.. ప్రస్తుతం ఒక్కరూ లేకపోవడంతో కాలువల నిర్వహణ గాలికొదిలేసినట్టయింది. లస్కర్లు లేకపోవడంతో కొంతమంది ప్రధాన కాలువల్లో అక్రమంగా పైపులైన్లు వేసి నీటిని తోడేస్తున్నారు. దీంతో ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో శివారు భూములకు సాగునీరందని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టు ఏఈలు, డీఈలే గేట్లు ఎత్తుకోవాల్సిన పరిస్థితి. కాలువలకు గండ్లు పడినా వారే స్వయంగా పూడ్చాల్సి వస్తోంది.

● సక్రమంగా తెరచుకోని కంట్రోల్‌రూమ్..

గొట్టాబ్యారేజీ వద్ద కంట్రోల్‌రూమ్ ఉద్యోగుల కొరతతో సక్రమంగా తెరుచుకోవడంలేదు. వర్క్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉండడంతో కంట్రోల్ రూమ్‌ను ఉదయం, సాయంత్రం కాసేపు తెరిచి మూసేస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి నిల్వ, కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో పాటు రైతులకు వివరాలు అందించే వారు కరువయ్యారు.

● ఉన్నతాధికారులకు నివేదించాం

గొట్టాబ్యారేజీ నిర్వహణకు ఉద్యోగుల కొరత వాస్తవమే. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. వరదల సమయంలో చాలా సమస్యలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతి వచ్చిన వెంటనే తాత్కాలిక పద్ధతిలోనైనా నియమించేలా చర్యలు చేపడతాం.

- డోల తిరుమలరావు, ఎస్ఈ, వంశధార ప్రాజెక్టు

వైసీపీ నేతకు అధికారుల దాసోహం

- పని చేయకుండా 640 సిమెంటు బస్తాలు ధారాదత్తం
- మూడేళ్లయినా ప్రారంభించని డిజిటల్ గ్రంథాలయం

సంతబొమ్మాళి, మార్చి 12: సంతబొమ్మాళి మండలంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి సోదరుడికి మండల ఇంజనీరింగ్ అధికారులు దాసోహమయ్యారు. డిజిటల్ గ్రంథాలయానికి సంబంధించి పనులు చేయకుండానే మూడేళ్ల కిందట 640 సిమెంట్ బస్తాలు ధారాదత్తం చేయడం చర్చనీయాంశమవుతోంది. హనుమంతు నాయడుపేట సచివాలయానికి 2020లో రూ.16లక్షలతో డిజిటల్ గ్రంథాలయం మంజూరైంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భవనం మంజూరైతే ముందుగా రెవెన్యూ అధికారులు స్థలం చూపించాలి. తర్వాత మండల ఇంజనీరింగ్ అధికారులు ఆ భవన నిర్మాణానికి అంచనా ఆధారంగా మార్కింగ్ ఇవ్వాలి. సంబంధిత కాంట్రాక్టర్ భవన నిర్మాణానికి పునాదులు తవ్విన తర్వాత ఇంజనీరింగ్ అధికారులు సిమెంటు పంపిణీ చేయాలి. కాగా రెవెన్యూ అధికారులు డిజిటల్ గ్రంథాలయం కోసం ఇంతవరకు స్థలం కేటాయించలేదు. ఇంజనీరింగ్ అధికారులు మాత్రం అధికారపార్టీ నేత కోసం నిబంధనలు తుంగలో తొక్కారు. నిర్మాణం ప్రారంభం కాని భవనానికి ఏకంగా 640 సిమెంటు బస్తాలు మూడేళ్ల కిందటే పంపిణీ చేశారు. ప్రభుత్వ ధరల ప్రకారం ఒక్కొక్క బస్తా రూ.280 కాగా, మెత్తం రూ.1,79,200 ముట్టజెప్పారు. ఇంతవరకూ పనులు ప్రారంభించకపోవడంతో సిమెంట్ దారి మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. సిమెంట్ అందజేసి మూడేళ్లవుతున్నా పనులు ప్రారంభించని వైసీపీ నేతపై ఇంజనీరింగ్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల పనులు చేసినా బిల్లులు అందక ఇబ్బం దులు పడుతుండగా.. ఇక్కడ మాత్రం పనులు చేయకుండానే అధికార పార్టీ నేతతో అధికారులు కుమ్మక్కై సిమెంట్‌ను దారి మళ్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మండల ఇంజనీరింగ్ అధికారి లాడి విష్ణుప్రియను వివరణ కోరగా.. తాను ఇక్కడ విధుల్లో చేరకముందు సిమెంట్ పంపిణీ జరిగిందన్నారు. ఇంతవరకు డిజిటల్ గ్రంథాలయం పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. సిమెంట్ రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు.

సిక్కోలులో వందే భారత్

- రైల్వే అభివృద్ధికి మరింత కృషి: ఎంపీ రామ్మోహన్

ఆమదాలవలస, మార్చి 12: వందేభారత్ రైలు జిల్లావాసులకు అందుబాటులోకి వచ్చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఈ రైలు మంగళవారం శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో కూత పెట్టింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్ల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైల్వేస్టేషన్ల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయన అధికారులు, పలువురు నేతలతో కలిసి శ్రీకాకుళం రోడ్డు నుంచి ఇచ్ఛాపురం వరకు రైలులో ప్రయాణించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, స్థానిక టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, బి.వి.రమణమూర్తి, లంక నాగరాజు, నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య పాల్గొన్నారు.



వందేభారత్ రైల్లో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

రోడ్డు ప్రమాదాల్లో ఒక్కప్రాణమూ పోకూడదు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం అర్బన్, మార్చి 12: 'జిల్లాలోని రోడ్డు ప్రమాదాల్లో ఏ ఒక్క ప్రాణం కూడా కోల్పోయే పరిస్థితి ఉండరాదు. రహదారి ప్రమాద మరణాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాల'ని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'నవ భారత్, బైపాస్ కూడలి వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాల'ని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఆదేశించారు. 'సింగుపురం అండర్ పాసైజ్‌లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. జాతీయ రహదారిపై గుర్తించిన 33 బ్లాక్ స్పాట్‌ల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. కొత్తరోడ్డు నుండి నరసన్నపేట వైపు వెళ్లే వాహనాల కోసం బైపాస్ ఏర్పాటు చేయాలి. రహదారులపై వ్యర్థాలు పోసి వాటి తగలపెట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. ప్రమాదం జరిగిన గంటలోపే తక్షణ వైద్య సహాయం అందేలా చూడాలి. తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాల'ని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ గడిచిన 14 నెలల్లో జిల్లాలో 709 ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. 223 మంది ప్రాణాలు కోల్పోగా, 1,216 మందికి గాయాలయ్యాయని వివరించారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఆర్వో ఎం.గణపతిరావు, రవాణాశాఖాధికారి గంగాధరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాను సుధాకర్, డీఎంహెచ్‌వో మీనాక్షి పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరు లేదని..

- నిలిచిన పాఠశాల భవనం ప్రారంభం
- వైసీపీలో బయటపడిన విభేదాలు



వివాదానికి కారణమైన శిలాఫలకం

ఆమదాలవలస, మార్చి 12: ఆమదాలవలస నియోజకవర్గంలోని వైసీపీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఇంతవరకూ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యతిరేక వర్గం.. ఆయన చేపట్టే కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. తాజాగా మంగళవారం సీతారాం అనుచరుల్లోనూ విభేదాలు వెలుగుచూశాయి. మెట్టక్కివలస జడ్పీ బాలకోన్నత పాఠశాల 'నాడు-నేడు' పనులు, ఆమదాలవలస గేటులో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్పీకర్ షెడ్యూల్ నిర్ణయించారు. ఈ మేరకు ముందుగా మెట్టక్కివలస పాఠశాల భవనాన్ని స్పీకర్ ప్రారంభించారు. అయితే ఆమదాలవలస గేటు పాఠశాల వద్ద శిలాఫలకంపై తల్లిదండ్రుల కమిటీ(ఎఫ్ఎంసీ) చైర్మన్ అల్లంశెట్టి చిన్న పేరు లేకపోవడం వివాదాస్పదంగా మారింది. మాజీ కౌన్సిలర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు.. తన భార్య అయిన ఎఫ్ఎంసీ చైర్మన్ పేరు లేకపోవడంతో రాత్రి సమయంలో ఆ శిలాఫలకాన్ని తొలగించినట్టు మరో వర్గం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మునిసిపల్ 'నాడు-నేడు' ఏఈ బొడ్డేపల్లి సృజన.. శిలాఫలకంపై ఎఫ్ఎంసీ చైర్మన్ చిన్న పేరును స్టిక్కర్‌గా ఏర్పాటు చేసినా మాజీ కౌన్సిలర్ శాంతించలేదు. దీంతో పాఠశాల ప్రారంభోత్సవాన్ని నిలిపేశారు. ఒక వ్యక్తి కోసం ఇలా చేయడం పద్ధతి కాదని మాజీ కౌన్సిలర్ వ్యతిరేక వర్గం వాదనకు దిగింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాదనతో పరిస్థితి వేడెక్కింది. ఎంఈవో, ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేసినా.. స్పీకర్ తమ్మినేని గేటు ఉన్నతపాఠశాలను ప్రారంభించకుండా అదేదారిలో వెళ్లిపోవడంతో వర్గ విభేదాలపై గుసగుసలాడుకుంటున్నారు. ఇంతవరకూ తమ్మినేనికి వ్యతిరేక వర్గాలు ఉండగా.. ఇప్పుడు ఆయన అనుచరుల్లోనూ మనస్పర్థలు నెలకొని విభేదాలు బయటపడడం చర్చనీయాంశమైంది.

మంజూరైనా.. అంతేనా?

- డీఎంహెచ్‌వో కార్యాలయంలోమూలుగుతున్న సీడీఫోర్ మిషన్
- టెక్కలిలోని జిల్లాకేంద్రాసుపత్రిలో హెచ్ఐవీ రోగులకు తప్పని అవస్థలు
- గదులు లేవంటూ ఒకేచోట ఐసీటీసీ, ఏఆర్‌టీ ల్యాబ్‌ల నిర్వహణ

(టెక్కలి)

హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు సేవలు అందించడంలో జిల్లా కేంద్రాసుపత్రి చతికిలపడింది. టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి క్లస్టర్ ఆఫ్ డిఫరింటేషన్ ఫోర్ అనే లక్షల ఖరీదు గల అధునాతన యంత్ర పరికరం మంజూరైంది. కాగా ఇక్కడ సరిపడే గదులు లేవంటూ మూడు నెలలుగా శ్రీకాకుళంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉంచేశారు. వాస్తవానికి హెచ్ఐవీ రోగులకు ప్రతి ఆరు నెలలకోసారి ఎంతశాతం పాజిటివ్ నమోదవుతుందో గుర్తించేందుకు సీడీఫోర్ మిషన్ వినియోగిస్తారు. జిల్లా కేంద్రాసుపత్రిలో సీడీఫోర్ మిషన్ అందుబాటులో లేక హెచ్ఐవీ రోగుల శాంపిల్స్‌ను టెక్నీషియన్ తరచూ శ్రీకాకుళంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం దగ్గరకు తీసుకువెళ్లాల్సి వస్తోంది. టెక్నీషియన్‌కు కనీసం టీఏ సౌకర్యం కూడా లేదు. ఇచ్ఛాపురం నుంచి కోటబొమ్మాళి వరకూ ఉన్న హెచ్ఐవీ రోగులు జిల్లా కేంద్రాసుపత్రికి రోజు సుమారు 130 మంది వస్తుంటారు. వారికి అవసరమైన మందుల కిట్లను ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి చెందిన ఏఆర్‌టీ సిబ్బంది పంపిణీ చేస్తుంటారు. మరోపక్క ఆసుపత్రిలో గదుల కొరత పేరిట ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్లు ఒకే గదిలో పెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఎందుకంటే హెచ్ఐవీ పరీక్షలకు వచ్చే గర్భిణులు, సాధారణ రోగులకు, అలాగే మెడికల్ కిట్స్ ఇవ్వడం, శాంపిల్స్ సేకరించడం, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. ఏఆర్‌టీ సిబ్బంది రోజూ ఆసుపత్రికి వచ్చే హెచ్ఐవీ రోగులకు సీడీఫోర్ టెస్టులు రోజుకు 20కుపైగా చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో పారామెడికల్ సిబ్బంది విశ్రాంతికి ఏసీ రూం సౌకర్యం ఇచ్చి హెచ్ఐవీ పాజిటివ్ శాతం గుర్తించేందుకు అవసరమైన సీడీఫోర్ మిషన్లు ఉంచేందుకు గది సమకూర్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ మెతక వైఖరే కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు వద్ద ప్రస్తావించగా సీడీఫోర్ మిషన్ జిల్లా కేంద్రాసుపత్రిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.



టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రి



ఒకేచోట ఐసీటీసీ, ఏఆర్‌టీ ల్యాబ్‌ల నిర్వహణ



ఎమ్మెల్యే కిరణ్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న ప్రజలు



సమావేశానికి వస్తేనే 'చేయూత'

- బలవంతంగా జనసమీకరణ
- ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగిన మహిళలు

జి.సిగడాం, మార్చి 12: అధికారపార్టీ నేతల ఆదేశాల మేరకు 'చేయూత' సమావేశానికి వలంటీర్లు బలవంతంగా జన సమీకరణ చేసి తరలించారు. మంగళవారం జి.సిగడాం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే చేయూత సమావేశానికి వస్తేనే ఈ పథకానికి సంబంధించిన నిధులు మంజూరు చేస్తామని, లేదంటే డబ్బులు రావని వలంటీర్లు లబ్ధిదారులకు చెప్పారు. వ్యవసాయం, ఇతర పనులు ఉన్నాయని చెప్పినా వినకుండా.. ఇంటింటికీ వెళ్లి మహిళలను బలవంతంగా బయలుదేరించి సమావేశానికి ఆటోల్లో తరలించారు. కాగా.. అధికారులు మాట్లాడినంత వరకు మహిళలు ఓపిక పట్టారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ప్రసంగిస్తుండగా కొంతమంది మహిళలు సమావేశం నుంచి వెనుదిరిగారు. మొక్కజొన్న పంట సమయంలో పనులు వదిలేసి.. బలవంతంగా సమావేశానికి తరలించడంపై గుసగుసలాడుకున్నారు.

టీడీపీ కృషితోనే వందేభారత్‌కు హాల్ట్

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

ఇచ్ఛాపురం, మార్చి 12: టీడీపీ కృషి వల్లే జిల్లాలో వందేభారత్ రైలుకు హాల్ట్ వచ్చిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విశాఖ నుంచి భువనేశ్వర్ వరకు నడిచే వందేభారత్ రైలులో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు ఎంపీ మంగళవారం ప్రయాణించారు. ఈ మేరకు ఇచ్ఛాపురం రైలులో వచ్చిన ఎంపీకి ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వే మంత్రి, రైల్వే బోర్డ్ చైర్‌పర్సన్‌ను కలిసి విశాఖ నుంచి భువనేశ్వర్ వరకు వందే భారత్ రైలు నడపాలని తొమ్మిది నెలల పాటు ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ రైలుకు జిల్లాలో శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం రైలు స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారన్నారు. ఇచ్ఛాపురంలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఉంటుందని తెలుసుకున్న టీడీపీ, వైసీపీ నాయకులు అక్కడకు చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. దీంతో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, నందికి జాని, సాలిన డిల్లీ, కొండా శంకర రెడ్డి, కాళ్ల జయదేవ్, దిలీప్, పత్రి తవిటయ్య, లీలా రాణి, బీజేపీ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలా రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ స్వాగతం పలికారు.





పలాస: వందేభారత్ రైలుకు స్వాగతం పలికేందుకు వస్తున్న టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) రైలు నుంచి అభివాదం చేస్తున్న ఎంపీ రామ్మోహన్

పలాసలో ఘనస్వాగతం

పలాస: వందేభారత్ రైలు శ్రీకాకుళం జిల్లాకు తొలిసారి రావడంతో పలాస రైల్వే స్టేషన్‌లో మంగళవారం టీడీపీ, బీజేపీ క్యాడర్ ఘన స్వాగతం పలికింది. విశాఖ నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు రైలు పలాస స్టేషన్‌కు చేరుకోగానే టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు రైలులో వస్తున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు స్వాగతం పలికారు. స్టేషన్‌కు సమీపించగానే ఎంపీ ప్రయాణికులకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను పలాసలో నిలుపుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. శిరీష మాట్లాడుతూ.. రామ్మోహన్‌నాయుడు అంటే నే అభివృద్ధి అని, రైలును జిల్లాకు వచ్చేందుకు ఆయన చేసిన కృషిని జిల్లా ప్రజలు మరిచిపోరన్నారు. విశాఖ డివిజన్ రైల్వే అధికారులు ఈ రైలులో పలాస చేరుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని వారు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్, గురిటి సూర్యనారాయణ, యవ్వారి మోహన రావు, బడ్డ నాగ రాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి, టంకాల రవిశంకర్ గుప్తా, రామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో ఎంపీ రామ్మోహన్‌కి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ ఇంజక్షన్ల అందజేత



ఇంజక్షన్లు అందిస్తున్న టీడీపీ-జనసేన నాయకులు

పలాస: స్థానిక కిడ్నీ ఆసుపత్రిలో డయాలసిస్ రోగులకు జనసేన పార్టీ సమన్వయకర్త దుర్గారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మంగళవారం ఉచితంగా ఎరిత్రోపోయిటెన్ ఇంజక్షన్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ మందులను ఉచితంగా అందించేదని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిందన్నారు. దీంతో రోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనసేన-టీడీపీ-బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత మందులు పునరుద్ధరిస్తా మన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు ఎన్.ధర్మారావు, కె.కృష్ణారావు, వంశీ చౌదరి, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, తామాడ రాము, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

'రిగ్గింగ్ చేసే దమ్ము జడ్పీటీసీకి ఉందా?'

సంతబొమ్మాళి: సార్వత్రిక ఎన్నికల్లో రిగ్గింగ్ చేస్తానని వైసీపీకి చెందిన జడ్పీటీసీ వసంత రెడ్డి ప్రకటించారని, ఆ దమ్ము ఆయనకు ఉందా అని టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో జడ్పీటీసీ రిగ్గింగ్ చేయాలని పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిన్న కాక మొన్న రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు పోలింగ్ బూత్‌లను రిగ్గింగ్ చేసే దమ్ము ఎక్కడిదన్నారు. సంతబొమ్మాళి మండలం టీడీపీకి, కింజ రాపు కుటుంబానికి కంచుకోట అని, ఇక్కడ రిగ్గింగ్ చేసే ధైర్యం వసంతరెడ్డికి లేదని, ఆయనను ఆ పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదని, వారి మెప్పు కోసం ఇలాంటి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఆ ప్రకటనలో దుయ్య బట్టారు.

పోటీ పరీక్షల శిక్షణను వినియోగించుకోండి

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కెరియర్ గైడెన్స్ వారి ఆధ్వర్యంలో పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు శిక్షణను మంగళవారం ప్రారం భించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్, అధ్యాపకులు గిరీష్, సంతాన కుమార్, తరుణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం అమ్మవారికి చల్లదనం



నందిగాం: నందిగాంలో ఇటీవల పునర్నిర్మాణం చేసుకుని విగ్రహ ప్రతిష్ఠ చేసిన పాతపట్నం అమ్మవారికి మంగళవారం గ్రామస్థులు చల్లదనం చేశారు. మారువారం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ముర్రాటలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధికి బాటలు

నరసన్నపేట: వైసీపీ ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం జమ్ము మండలమ్మ పేరంటాలు గుడి వద్ద బస్ షెల్టర్, పురుషోత్తమ నగర్ కాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాన గోవిందరాజులు, బి.శంకరరావు, ఎంపీపీ ఆరంగి మురళీధర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పలాస: గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అప్పలరాజు కోరారు. మంగళవారం జీఎంఈ కాలనీ పార్టీ కార్యాలయంలో పలాస నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ● కాశీబుగ్గ: వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా పథకాలను అర్హులకు అందించామని మంత్రి అప్పలరాజు అన్నారు. మంగళవారం వైఎస్‌ఆర్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, హెచ్.వెంకట్రావు, బోర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పలాస: సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి అన్నారు. మంగళవారం మునిసిపల్ పారిశుధ్య కార్మికులతో ఆర్టీసీ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. సమ్మె పోరాటం ఫలితంగానే వేతనాలు పెరిగాయన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, పనిముట్లు, పనికితగిన వేతనం కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్ర మంలో పారిశుధ్య కార్మికసంఘ అధ్యక్షుడు మురుగన్, రవి, దివాకర్, రమేష్, సీతమ్మ, గులాబి, శకుంతల, తిరుపతిరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాజగోపాలరావుకు ఘన నివాళి

కాశీబుగ్గ: సీనియర్ పార్లమెంటేరియన్ బొడ్డేపల్లి రాజగోపాలరావుకు వివిధ పార్టీల నాయకులు ఘన నివాళి అర్పించారు. ఆయన 101 జయంతి సందర్భంగా పలాస-కాశీబుగ్గలోని ఆయన విగ్రహానికి పూలమాలలు జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, డాక్టర్ దువ్వాడ జీవి తేశ్వరరావు, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, హేమబాబు చౌదరి మాట్లాడుతూ.. 1952 నుంచి 1984 వరకు ఆరు పర్యాయాలు ఎంపీగా పనిచేసి బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తి అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, గాలి కృష్ణారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మువ్వల నాగేష్ హత్యపై దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను శిక్షించాలని జనసేన పలాస సమన్వయకర్త వి.దుర్గారావు కోరారు. ఈ మేరకు పూండిలో సోమవారం ఎస్పీ రాధికను నాగేష్ తల్లిదండ్రులతో కలిసి వినతిపత్రం అందించారు. విచారణ ముమ్మరం చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు మండలంలో ఎంపీ పర్యటన

నందిగాం: ఎంపీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు ఎం.బాలకృష్ణ, ఎస్.కృష్ణారావు, కె.హరిబాబు తెలిపారు. దిమ్మిడిజోల పంచాయతీ సవర రాంపురం చెరువుకు రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుడతారన్నారు. కాపుతెంబూరు కుమ్మరివీధిలో సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభం

పలాసరూరల్: అరుతడి పంటలపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో లాభాలు పొందవచ్చని శ్రీకాకుళం రైతుశిక్షణ కేంద్రం ఏడీ సీహెచ్ వెంకట్రావు అన్నారు. అమలకుడియా రైతు భరోసా కేంద్రంలో మంగళ వారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆరుతడి పంటల్లో సరైన మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సరైన సమయంలో మందులను పిచికారీ చేసి తెగుళ్ల వ్యాప్తి లేకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.కిరణ్‌కుమార్, ఏడీఏ ఎల్.మధు, ఏవో పోలారావు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్ఠంగా అమలుచేయాలి



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: రానున్న ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని సబ్ కలెక్టర్, టెక్కలి నియోజకవర్గ ఈఆర్వో నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏఆర్వోలు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలని, తప్పిదాలు జరగకూడదని, ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ స్టేషన్లు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నికలకు సంబంధించిన అన్నిరకాల శిక్షణలు త్వరితగతిన పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మెళియాపుట్టి: ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీవో జి.బాస్కరరావు అన్నారు. మంగళవారం జోడూరు పంచాయతీలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేయాలన్నారు. సమయపాలన, కొలతల ప్రకారం పని చేపడితే గిట్టుబాటవుతుందన్నారు. ఎవరైనా తప్పిదాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకుస్థానిక స్టేట్‌బ్యాంక్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం కార్య వర్గసభ్యుడు కె.మోహనరావు, సభ్యులు చాపర వేణుగోపాలరావు, సీపీఎం కార్యదర్శి ఎన్‌గణపతి, న్యూడెమోక్రసీ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో దొంగ ఓట్లు కొనుగోలుకు రాజకీయ పార్టీలు ఈ మొత్తాన్ని వినియోగిస్తున్నాయని, ఇందులో అధిక మొత్తం బీజేపీకే ముట్టాయని ఆరోపించారు. ఎటువంటి అక్రమాలు జరగకుండా సుప్రీంకోర్టు ఈ బాండ్లు ఎవరికి అందాయో వివరాలు ఇవ్వాలని ఎస్‌బీఐకి ఆదేశించిందన్నారు. ఆ వివరాలు బ్యాంకు అధి కారులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒత్తిళ్లకు గురికాకుండా ఎస్‌బీఐ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు గోరు వాసు, భాస్కరరావు, గోపి, బాలాజీ, భానుమతి, డిల్లేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోలాకి: మబగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మబగాం, పూడివానిపేట, గజపతినగరం, జొన్నాం, దుబకవానిపేట, రాళ్లపాడు, దీర్ఘాశి, తోటాడ, ఈదులవలస, మల్లపేట, కొల్లివలస, తలసముద్రం, జనావానిపేట తదితర గ్రామా ల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మిరప పంటలో తెగుళ్ల పరిశీలన



మిరపపంటకు పరిశీలిస్తున్న సునీత

డోల(పోలాకి): డోల ప్రాంతంలో సాగుచేస్తున్న మిరప పంటకు సోకిన తెగుళ్లను ఉద్యానవన శాఖాధికారి కె.సునీత, సహాయకురాలు బి.ఆమని మంగళవారం పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

హిరమండలం: రైతులు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ప్రయోజనం ఉంటుందని ఆత్మ పీడీ ఎ.రామచంద్రరావు అన్నారు. మహాలక్ష్మీపురం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పెసర, మినుము, నువ్వు పంటల్లో ఎరువులు వాడే విధానంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చిట్టిబాబు, సూర్యకుమారి, బి.రాజ గోపాల్, ఏవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతోనే అధిక దిగుబడి



మాట్లాడుతున్న సూర్యకుమారి

బసవరాజుపేట(ఎల్.ఎన్.పేట): వ్యవసాయంలో తెగుళ్లను నివారించడం ద్వారానే అధిక దిగుబడి సాధ్యపడుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సూర్యకుమారి అన్నారు. బసవరాజుపేట గ్రామంలో మంగళవారం తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకి పంటను సర్వనాశనం చేస్తుందన్నారు. దీని నివారణకు గాను వ్యవసాయశాఖ సిబ్బంది సల హాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు డివిజన్ ఏడీఏ బి.రాజగోపాలరావు, ఎల్.ఎన్.పేట, హిర మండలం వ్యవసాయాధికారులు పి.లతాశ్రీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇలపండపేటలో ఎర్రన్నాయుడి విగ్రహావిష్కరణ

ఇలపండపేట(పోలాకి): బొద్దాం పంచాయతీ ఇలపండపేట గ్రామంలో దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇలపండపేటలో పలువురు అభిమానులు టీడీపీలో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు, నాయకులు బైరి భాస్కరరావు, బగ్గు అర్చన, సూరపు నారాయణదాస్, కరుకోల రమేష్ బాబు, కోరాడ నాగరాజు, విష్ణు, వై.లక్ష్మణరావు, మెండ్రశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయండి

● ఎస్పీ జీఆర్ రాధిక



విజేతలకు బహుమతులందిస్తున్న ఎస్పీ రాధిక, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

వజ్రపుకొత్తూరు, మార్చి 12: విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యాల సాధన దిశలో పయనించాలని, విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. కమ్యూనిటీ పోలీ సింగ్‌లో భాగంగా రెండు రోజులుగా పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల విజేత లకు మంగళవారం బహుమతి ప్రదానం చేశారు. పూండి సాయివినీత్ విద్యాసంస్థల క్రీడా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు గర్వపడేలా మన చుట్టూ ఉన్న సమాజానికి ప్రేరణ కలిగిం చేలా విద్యా ర్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా ఉంటేనే మంచి ఆలోచనలు వస్తాయన్నారు. పోలీ సులు, ప్రజల మధ్య స్నేహభావం పెంపొందించే ఉద్దేశంతో కమ్యూనిటీ పోలీసింగ్ కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. పోలీసులంటే శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా ప్రజలతో మమేకమై వారిలో మరింత భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని జయించి విజయ సాధన దిశలో కృషి చేయాల న్నారు. అందుకు ముం దస్తు ప్రణాళికలు అవసరమన్నారు. చెడు సహవాసాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు జ్ఞాపికలు, బహుమతులు, ప్రసంశ పత్రాలను అందించారు. వజ్రపుకొ త్తూరు ఎస్ఐ సీహెచ్ రామారావు అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి, సీఐలు పి.ఈశ్వర రావు, ఆనంద్, కె.సూర్యనారాయణ, కాశీబుగ్గ ఎస్ఐ పి.పాపినాయుడు, విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కోదండరావు, డాక్టర్ లీల తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

మందస: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మందసలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాగోలు జెమ్స్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అలాగే విజయనగరం గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో దివ్యాంగులకు అవసరమయ్యే పరికరాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరాలయ సంప్రోక్షణం

● శివరాత్రి ఆదాయం రూ.7.75 లక్షలు



ఆలయానికి సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

జలుమూరు, మార్చి 12: సుప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయంలో మంగళవారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాలు చక్రతీర్థ స్నానాలతో ముగిసిన నేపథ్యంలో ఆలయానికి ఎటువంటి దోషాలు లేకుండా ఉండేందుకు ఆల యాన్ని శుద్ధి చేశారు. గణపతి పూజ, పుణ్యా హవచనం, నీరాజన మంత్ర పుష్పం, కలశారాధాన తదితర కార్యక్రమాలు చేశారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం లింగానికి అభిషేకాలు, విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తుల నుంచి వివిధ రూపాల్లో రూ.7,55,558 ఆదాయం వచ్చినట్లు ఈవో ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,16,980, కేశఖండన ద్వారా రూ.3920, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.1,980, స్వామివారి ఫొటోల ద్వారా రూ.2,320, హుండీల ద్వారా రూ.4,55,558, ఇతరత్రా ఆదాయం రూ.74,800 వచ్చినట్లు పేర్కొన్నారు. గత ఏడాది శివరాత్రి సందర్భంగా రూ.5,17,649 రాగా ఈ ఏడాది రూ.2,37,909 అదనంగా వచ్చినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు, అర్చకులు నారాయణమూర్తి, శివ, వెంకటాచలం, సింహాచలం, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సిద్ధం కండి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

పలాసరూరల్: పరీక్షలు సమీపిస్తున్న పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని ఉపాధ్యాయులు సూచించారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వ హించారు. ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం దిశగా పాటుపడాలి

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని, ఆ దిశగా పాటుపడాలని అక్కుపల్లి ఎంజే పీబీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు అన్నారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యా ర్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతు న్నందున కాలాన్ని వృథా చేయకుండా సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మమ అనిపించేశారు

పోలాకి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. అయితే ఎటువంటి చర్చ లేకుండానే తక్కువ సమయంలో సమా వేశం ముగించడంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సభ్యులు కాని వారే అధికంగా పాల్గొనడం గమనార్హం. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, వైస్ ఎంపీపీ కోట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రావివలసలో పశువైద్య శిబిరం

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య సహాయకులు తనూజ, ధనలక్ష్మి పశువులకు డీవార్మింగ్ చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో లూక్‌పాల్, వైస్‌ప్రిన్సిపాల్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భయంవీడి పరీక్షలు రాయాలి

నరసన్నపేట: పదో తరగతి విద్యార్థులు భయంవీడి పరీక్షలు రాయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతా రావు, పి.దాలినాయుడు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హాల్ టిక్కెట్లు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో హెచ్ఎంలు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల హెచ్ఎం వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న రవికుమార్


జలుమూరు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


సోంపేట : మామిడిపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్


జి.సిగడాం: టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

సైకో ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు ● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం


సంతబొమ్మాళి: ఆరికవలసలో అవగహనకల్పిస్తున్న టీడీపీ నాయకులు


కవిటి: బొరివంకలో ప్రచారం చేస్తున్న నీలోత్పల


నందిగాం: భరణిగాంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాష్ట్రంలో సైకో ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలోచేరారు.

నిరంతరం అప్పులతోనే పాలన: కూన

ఆమదాలవలస: రాష్ట్రంలో నిరంతరం అప్పులతో పరిపాలన సాగిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. ప్రతి మంగళవారం అప్పుల కోసం పడిగాపులు కాస్తున్నారని విమర్శించారు. మంగళవారం మండలంలోని దూసి, దూసిపేట, ముద్దాడపేట, పీరుసాహెబ్‌పేట గ్రామాల్లో ఆయన టీడీపీ సూపర్‌సిక్స్ శంఖారావం కార్యక్రమాలు నిర్వహించారు. రవికుమార్‌తోపాటు జనసేన నియోజకవర్గ కన్వీనర్ పేడాడ రామ్మోహన్ ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేనిఅప్పలనాయుడు, చంద్రశేఖర్, కంచరాన లోకేష్, సనపల డిల్లేశ్వరరావు, రమేష్, బొడ్డేపల్లి గౌరీపతి, హనుమంతు బాలకృష్ణ, సరుబుజ్జిలి జనసేన మండలాధ్యక్షుడు పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.

వైసీపీని ఓడించాలి: కిమిడి..

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పి చిత్తుగా ఓడించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పిలుపునిచ్చారు.ఎందువ పంచాయతీ నర్సింహపురంలో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, కుదిరెళ్ల బుజ్జి, అల్లు జోగినాయుడు, గొల్వి శ్రీనివాసరావు, కూనుబిల్లి కూర్మారావు, గొల్వి జగన్నాథం, ఆరెళ్ల గోల్లాజీ, బోగాది అప్పలనాయుడు, కోన వెంకటరావు, నక్క మురళి, పి.బంగారినాయుడు, బాలి తమ్మినాయుడు, మీసాల మునిలినాయుడు, జక్కంపూడి దాసు పాల్గొన్నారు.

టీడీపీలో 60 కుటుంబాలు చేరిక..

సోంపేట: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని మామిడిపల్లి పంచాయతీలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన సంగారు త్రినాథ్, బచ్చల సారథి, సంగారు హరికృష్ణ, సంగారు లక్ష్మీనారాయణ తదితర 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికులుగా మారాలి

సరుబుజ్జిలి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో సైకో ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ప్రతి పార్టీ కార్యకర్త సైనికుడిగా మారాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని మూలసవలాపురం, సరుబుజ్జిలి, మతలబుపేట పంచాయతీల్లో టీడీపీ నాయకులు శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడానికి అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు సిద్దార్థ, తర్లాడ సురేంద్ర, అంబళ్ల రాంబాబు, తాడేల రాజారావు, దవళ సింహాచలం, గోవిందరావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకర్, ఎండ రామారావు, కోటేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం

జలుమూరు: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని బీసీలకు తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేటలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. అభివృద్ధిని విస్మరించి బీసీలపై దాడులు, దౌర్జన్యాలతో వైసీపీపాలన సాగిందని విమర్శించారు. బీసీల అభ్యున్నతికి టీడీపీ-జనసేన సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, పార్టీ రాష్ట్ర బీసీ కమిటీ అధికారప్రతినిధి ధర్మాన తేజకుమార్, సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, నాయకులు సంపతిరావు చెత్తారావు, సురవరపు తిరుపతిరావు, గురుబెల్లి ఝాన్సీ, ఎం.దామోదరరావు, గోవిందరావు పాల్గొన్నారు.

సైకో పాలనకు స్వస్తి పలుకుదాం..

జలుమూరు (సారవకోట): రాష్ట్రంలో సాగుతున్న సైకో పాలనకు స్వస్తి పలుకుదామని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. సారవకోట మండలంలోని వెంకటాపురం ఎస్సీ కాలనీలో మంగళవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. నాయకులు కె.హేమంత్ కుమార్, ధర్మాన సంతోష్‌కుమార్, డి.జయరాం, చల్ల ఆనందరావు పాల్గొన్నారు.

● **నందిగాం:** టీడీపీ ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ఆ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మంగళవారం దేవాడ, దొడ్లరామచంద్రాపురం, భరణిగాం, మొజ్జువాడ గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు ఎం.బాలకృష్ణ, టి.ఉమా మహేశ్వరరావు, మదన్‌గౌడ్, గిరిబాబు, మోహనరావు, కె.ధర్మారావు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** టీడీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం ఆరికవలస, మహదేవపురంలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నాయకులు పంగ ఆశిరినాయుడు, సువ్వారి ప్రసాద్, కాంతారావు, రాజశేఖర్, దండాశి పాల్గొన్నారు.

● **కవిటి:** టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ భార్య నీలోత్పల తెలిపారు.మంగళవారం బొరివంకలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేసే విధంగా పథకాలను పెట్టారని వివరిస్తున్నామని చెప్పారు. నేతలు భాగ్యశ్రీ, బి.విజయకృష్ణ, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

● **పొందూరు:**పొందూరులో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు.


సారవకోట మండలంలోని వెంకటాపురం ఎస్సీ కాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న కత్తిరి వెంకటరమణ


సరుబుజ్జిలి: మూలసవలాపురంలో పర్యటిస్తున్న టీడీపీ శ్రేణులు


పొందూరు: బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పలాస జీఆర్పీ పరిధిలో జరిగిన వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ మేరకు మృతదేహాలను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో రైలు ఢీకొట్టిన సంఘటనలో ఒడిశాకు చెందిన మహిళ మృతి చెందిందని రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ షేక్ షరీఫ్ తెలిపారు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని రైలు 30-35 మధ్య వయస్సు గల మహిళను ఢీకొట్టినట్లు చెప్పారు.ఈ మేరకు ఒడిశాకు మహిళగా గుర్తించామని తెలిపారు. అలాగే జాడుపూడి-ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ల మధ్య గుడ్డిపద్ర రైల్వేగేట్ సమీపంలో రైలు ఢీకొట్టిన సంఘటనలో 25-30 సంవత్సరాల మధ్యగల యువకుడు మృతి చెందాడని పలాస జీఆర్పీ హెచ్‌సీ కోందదరావు తెలిపారు. మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామని చెప్పారు.

రాత్రి గస్తీ ముమ్మరం

● జాతీయ రహదారిపై వాహనాల ధ్రువపత్రాల పరిశీలన


కంటైనర్‌లో తనిఖీచేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు రాత్రి గస్తీ ముమ్మరంచేశారు. ఇటీవల గంజాయి రవాణా తారాస్థాయికి చేరిన విషయం విదితమే. ఏకంగా కంటైనర్లల్లో అక్రమ రవాణా జోరందుకోవడంతో జాతీయరహదారులపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఈనేపథ్యంలోటూటౌన్ సీఐ జి. మహేశ్వరరావు సోమవారం అర్ధరాత్రి వరకు గంజాయి,మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా జాతీయరహదారిపై భారీ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలు,కంటైనర్లను తనిఖీలు నిర్వహించి, ధ్రువపత్రాలు పరిశీలించారు. గతంలో అర్ధరాత్రి వరకు తిరిగే ఆకతాయిలు, మందుబాబులను పట్టుకుని వారికి అవగాహ న కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని సీఐ హెచ్చరించారు.

ఇచ్ఛాపురంలో పోలీసుల కవాతు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కవాత్ నిర్వహించారు. 75 మంది పోలీస్ సిబ్బందితో పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్, మార్కెట్ జంక్షన్, బెల్లుపడ, కార్ణీవీధి గుండా సురంగిరాజా మైదానం వరకు కవాత్ నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ ఎన్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు చైతన్యం కావాలి

ఎచ్చెర్ల: మహిళలు హక్కులు సాధనకు మరింత చైతన్యం కావాలని జిల్లా పర్యాటకాభివృద్ధి మండలి సభ్యుడు, స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పంచిరెడ్డి కృష్ణారావు తెలిపారు. మండలంలోని ధర్మవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం మహిళల హక్కుల పరిరక్షణ, చైతన్యంపై ర్యాలీ నిర్వహిచారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ డి.తాతారావు, ఎంపీటీసీ సభ్యుడు బగ్గు రాజారావు, అల్లు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ జడ్పీ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇక్కడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావుకు సత్కరించారు.కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ శంకర్, హెచ్ఎం దున్న రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని భగవతి శ్రీస్వేచ్ఛావతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆటో డ్రైవర్లకు రూ.60 అందజేశారు. కొంతకాలంగా ఆటో డ్రైవర్లు ఆశిగోపాల్, సాడి దానకర్ణలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో స్పందించిన ఆటోయూనియన్ సభ్యులు ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పునఅందించారు కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఉలాసి ఎర్రయ్యరెడ్డి, ముకుంద, రంగ, తులసి, మధన్ తిరుమల పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి: పీడీ

గార:ప్రతికుటుంబానికి వందరోజులు పనికల్పించాలని డ్వామా పీడీ చిట్టిరాజు తెలిపారు.మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.అనంతరం సతివాడ, నిజామాబాద్ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో బి.కల్యాణి, ఏపీవో సంధ్యారాణి జేఈ నారన్నాయుడు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

సోంపేట : సోంపేటలో శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, మందస, పలాస మండలాలకు చెందిన 350 మంది పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, చైతన్య దీపిక సభ్యులు దేవాడ మోహనరావు, బీన ఆనంద్, బల్ల జానకిరావు, జాక కేశవరావు, బంజులోకనాథం,దూగాన మోహనరావు, కాంతారావు, శంకరరావు పాల్గొన్నారు.

కొందరికే టిడ్కో ఇళ్లు

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని జగ్గుశాస్త్రులపేట వద్ద ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో నిర్మించిన గృహాలు కొందరి లబ్ధిదారులకే అందజేశారు.దీంతో మిగిలిన లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. ఈమేరకుమంగళవారం స్పీకర్ తమ్మినేని సీతారాం టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభించారు. గత టీడీపీ హయాంలో ఈ టిడ్కో గృహ సముదాయానికి నిధులు మంజూరుచేసి అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధికారంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు మందకొడిగా చేపట్టింది. ప్రస్తుతం 11 బ్లాక్‌లో 528 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నా కేవలం మూడు బ్లాకుల్లో 148 ఇళ్లు పూర్తి చేసి స్పీకర్ ఆదరాబాదరాగా మంగళవారం ప్రారంభించారు.

వైసీపీ ఆవిర్భావ వేడుకలకు ధర్మాన దూరం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ 14వ ఆవిర్భావ వేడుకలకు రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆవిర్భావ వేడుకలకు అందరూ హాజరుకావాలని సోమవారం పిలుపునిచ్చారు. అయితే ఆ వేడుకలకు మంత్రితో పాటు ఆయన వర్గీయులు కూడా హాజరుకాకపోవడం విశేషం.

'తటస్థ ఓటర్లపై దృష్టి సారించండి'

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల్లో తటస్థ ఓటర్లపై దృష్టి సారించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాష్‌రావుపట్నాయిక్, దుక్కలోకేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.●**ఆమదాలవలస:**ఆమదాలవలసలో వైసీపీనాయకులు ఆ పార్టీ ఆవిర్భావదినోత్సవం వేర్వేరుగా నిర్వహించారు. స్పీకర్ సీతారాం ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆ పార్టీ సీనియర్ నాయకుడు సువ్వారి గాంధీ సోదరుడు సత్యనారాయణ తన అనుచరులతో వైఎస్ విగ్రహానికి నివాళుర్పించడం విశేషం.

ఆదిత్యుని సన్నిధిలో గాయకుడు కారుణ్య

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లిలోని సూర్యనారాయ స్వామి వారిని ప్రముఖ సినీ గాయకుడు ఎన్సీ కారుణ్య మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యుని సన్నిధిలో గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు స్వామి వారి నిజరూప చిత్ర పటాన్ని కారుణ్యకు అందించారు. ● **గార:** శ్రీకూర్మనాథుని సినీ నేపథ్య గాయకుడు కారుణ్య మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు కిషోర్ బాబు వారికి వివరించారు.

ప్రజలకు వాస్తవాలను చెప్పాలి: లక్ష్మీదేవి


మాట్లాడుతున్న గుండ లక్ష్మీదేవి

శ్రీకాకుళం,(ఆంధ్రజ్యోతి): వైసీపీవి నీలివార్తలని, వాస్తవాలను ప్రజలకు చెప్పాలని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం అరసవల్లిలోని తన నివాసంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయ, నియోజకవర్గానికి చెందిన కళింగవైశ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కళింగవైశ్యులను బీసీ జాబితాల చేర్పించినట్లు తెలిపారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే వైశ్యులను ఓబీసీ జాబితాలో చేర్పించే బాధ్యత తీసుకుంటామని, ఇటీవల శ్రీకాకుళం సభలో చంద్రబాబునాయుడు కూడా హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్యవిభాగం ప్రధానకార్యదర్శి హరగోపాల్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ భీమశంకర్ పాల్గొన్నారు.

వైసీపీని మట్టి కరిపించాలి: మాదారపు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని మట్టికరిపించాలని టీడీపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ కోరారు.మంగళవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మహిళలు, పురుషులు కలిసికట్టుగా వైసీపీని ఓడించేందుకు ఇప్పటినుంచే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో మూడుదఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడిని నాలుగో దఫా సీఎంగా,దేశంలో మూడో దఫా ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని చూడాలని ప్రజలు మక్కువ చూపుతున్నారని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా ఆమోదించాలని, యువ ఓటర్లు సైతం ఆలోచించాలని కోరారు.

పెద్దలంకాం గ్రామస్థులు టీడీపీలో చేరిక


విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న పెద్దలంకాం గ్రామస్థులు

బూర్జ: మండలంలోని పెద్దలంకాంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, మొదలవలస రమేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు పైడిసత్యప్రసాద్, అన్నెపు రామకృష్ణ, బూర్జ మండల టీడీపీ అధ్యక్షుడు వావిలపల్లి రాంజీ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జగన్నాథనాయుడు, వెంకటప్పలనాయుడు, కడగల కృష్ణ, కుమారపు అచ్చెమనాయుడు, కోడి గోవిందరావు, రమేష్ పాల్గొన్నారు.

రాజగోపాలరావు సేవలు మరువలేనివి


రాజగోపాలరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొడ్డేపల్లి సురేష్

గుజరాతీపేట: బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు జిల్లా ప్రజలు మరువలేనివని ప్రముఖ వైద్యుడు, బీసీ సంక్షేమ సంఘం మెడికల్ విభా రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం బొడ్డేపల్లి రాజగోపాలరావు 101వ జయంతి పురస్కరించుకుని శ్రీకాకుళంలోని రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ప్రస్తుత యువత రాజగోపాలరావును స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'ఈఎస్ఎంఎస్'పై అవగాహన తప్పనిసరి: కలెక్టర్


మాట్లాడుతున్న మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం అర్బన్: ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాల ద్వారా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల రియల్ టైమ్ డేటాను ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు చేరవేయడానికి వినియోగించే ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ(ఈఎస్ఎంఎస్) యాప్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలి పారు. మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, ఎస్పీ రాధికతో కలిసిసమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా మోహరించే ఫ్లైయింగ్ స్క్వాడ్స్, సర్వెలెన్స్ బృందాలు పట్టుకునే వస్తువుల వివరాలు ఈఎస్ఎంఎస్‌లో నమోదు చేయాలని తెలిపారు. నివేదిక వివరాలను పోలీసు, ఎక్సైజ్, సెంట్రల్ జీఎస్టీ, ఆదాయ పన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరీ వివిధ శాఖల అధికారులు వీక్షించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు. ఎస్పీ రాధికసరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల గురించి వివరించారు. రవాణా, ఎక్సైజ్, సీఎస్టీ, అటవీ శాఖ సెబ్ బృందాలు నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.సమావేశంలో డీఆర్వో గణపతిరావు, ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, జిల్లా అటవీ శాఖాధికారి నిషా కుమారి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణిమోహన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్:ప్రైవేట్ ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రిజిస్ట్రేషన్ అథారిటీ,జిల్లా సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఎంసీఈ చట్టం-2008, క్లినికల్ ఎస్టాబ్లిస్మెంట్ చట్టం, జీవో-35,135లను అనుసరించి జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, దంత వైద్యశాలలు, లాబోరేటరీలు, ఫిజియోథెరపీ సెంటర్లు వెబ్‌సైట్లో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈ సర్టిఫికెట్‌ను ఈనెల 31లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న ఆస్పత్రులు ఐదేళ్లు పూర్తయితే రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టిక ప్రదర్శించాలని, అందించే సేవలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మీనాక్షి, సలహా మండలి సభ్యులు చక్కా నారాయణరావు, అమ్మన్నాయుడు, మాస్ మీడియా అధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని 13,15 వార్డుల పరిధిలో గల అచ్చంపేటలో, 18వ వార్డు రత్తకన్నలో మురుగుకాలువలు, సంతోషం వీధిలో కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అన్వేష్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

ఇచ్ఛాపురం: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అప్పారావు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చాణక్య రాష్ట్ర కౌన్సిలర్ బి.రాజేష్, హెచ్ఎం విశ్వనాథం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో ఆశీలు వేలం పాట

ఇచ్ఛాపురం: మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్ .రమేష్ అధ్యక్షతన డైలీమార్కెట్, వీధి గుత్త, కబేళా ఆశీలు బహిరంగ వేలంపాట మంగళవారం నిర్వహించారు. వీధిగుత్త, డైలీమార్కెట్ వేలంపాట రూ.23 లక్షల 15 వేలుకు, కబేళా రూ.1.25 లక్షలకు పిట్ట బైరాగి సొంతం చేసుకున్నారు. గత నెల 21న వేలం పాట జరిగిన విషయం విదితమే. అప్పట్లో వీధిగుత్త, మార్కెట్ ఆశీలు రూ.23 లక్షల వేయి, కబేళా రూ.1.21 లక్షలకు పాట ఖరారు చేశారు. అయితే పాటకు సంబంధించి కౌన్సిల్ ఆమోదానికి గత నెల చివరిలో కోరారు. ఆశీలు గతఏడాది కంటే బాగాతగ్గడంతో పాట రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని కౌన్సిల్ కోరడంతో రెండోసారి మంగళవారం పాట నిర్వహించారు. ఈనెలలో జరిగే కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం పొందిన తరువాత పాట ఖరారు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు.

ప్రతి సంఘానికి రుణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం: రణస్థలం యూనియన్ బ్యాంకు బ్రాంచ్ పరిధిలో అర్హత గల ప్రతి స్వయంశక్తి సంఘానికి ఎటువం టి వివక్షలేకుండా రుణాలు మంజూరు చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ డి.సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు ఇవ్వట్లే శీర్షికన ఈనెల11న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించారు. ఇటీవల నిర్వహించిన రుణమేళాలో 19 స్వయం సంఘాలకు రూ.2.5 కోట్ల రుణాన్ని మంజూరుచేశామని తెలిపారు. గతేడాది డిసెంబరులో 112 సంఘాలకు రూ.14.7 కోట్లు, ఈ ఏడాది జనవరిలో 11 సంఘాలకు రూ.కోటి, ఫిబ్రవరిలో 75 సంఘాలకు 8.1కోట్ల రుణం అందజేశామని చెప్పారు. ఈఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 141.87 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. తమ శాఖ ద్వారా 956 సంఘాలు రుణాలు పొందుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈనెల 11 నాటికి 454 సంఘాలకు రూ.54.6 కోట్ల రుణాలు మంజూరుచేశామని తెలిపారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం:ఇచ్ఛాపురం మునిసిపల్‌కౌన్సిల్ హాల్‌లో అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 15వఆర్థికసంఘ నిధులతో కొనుగోలుచేసిన క్యాంపెక్టర్ వాహనాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొ న్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

కంచిలి: స్థానిక కేజీబీవీలో ఆరు,ఇంటర్‌లో ప్రవేశానికి, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 11లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.అనాథలు, బడిబయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరు 18004258599 కు సంప్రదించాలని తెలిపారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగతపరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంసాధ్యమని వైద్యాధికారులు యశ్వంత్,సుమబిందు తెలిపారు. మంగళవారం పెంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాగోలు జెమ్స్ వైద్య నిపుణులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివప్రసాద్, హెచ్ఎస్ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎంలు పద్మ, భవాని, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నాడు-నేడు భవనాల ప్రారంభం

పొందూరు: పొందూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో సుమారు 1.46 కోట్లతో చేపడుతున్న నాడు-నేడు భవనాలకు బుధవారం ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ పాఠశాల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలపై విచారణ జరిగిన విషయం విదితమే.ఇక్కడ జరిగిన అవినీతిపై ప్రశ్నించేవారికి ఓ వ్యక్తి కుమారుడు బెదిరింపులకు దిగుతున్నట్లు విమర్శలొస్తున్నాయి.ఈనేపథ్యంలో బిల్లులు పూర్తిగా చెల్లిస్తేనే భవనాలు ఇస్తానని, బిల్లులు చెల్లించకుండా తన అనుమతి లేకుండా భవనాలు ప్రారంభిస్తే సమస్యలు తప్పవని గత చైర్మన్ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.